క్లుప్తంగా

పదవీ విరమణ ఉద్యోగికి ఘన సన్మానం



రమణారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ

ఆరిలోవ: లాసన్స్‌బే కాలనీలోని సెంట్రల్ గవర్నమెంట్‌కు చెందిన ఎన్‌సీసీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన నీలపు రమణారెడ్డికి ఆ విభాగానికి చెందిన ఉద్యోగులు కంబాలకొండలో ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని రమణారెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది మనిషి ప్రశాంత జీవితం గడపడానికేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కార్పొరేటర్ ముప్పల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, తోటి ఉద్యోగులు నాగరాజు, పోలిరెడ్డి, శ్రీను, శ్రీధర్, కుమార్, ఎర్రాజీ, రాంబాబు. తదితరులు పాల్గొన్నారు.

ఉత్కల్ సమాజ్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

బీచ్‌రోడ్డు: ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. సిరిపురంలోని ఉత్కల్ కార్యాలయంలో నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో కొత్త అధ్యక్షుడిగా జె.కె.నాయక్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కరుణాకర్, ఎస్.పి.భుయాన్, కార్యదర్శిగా బిమల్ మహంత, కోశాధికారిగా మహేశ్వర్ బెహరా, సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా సీమా మొహంతి ఎన్నికయ్యారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

భారతీయ సంప్రదాయ సంగీతం అద్భుతం

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో డివిజనల్ కల్చరల్ అసోసియేషన్(డీసీఏ) ఆదివారం రైల్ గార్డెన్‌లో నిర్వహించిన క్లాసికల్ సంగీత్ మేళా కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి మాట్లాడుతూ కళాకారుల్లోని కళలను ఇతరులకు తెలియజేసేదిగా ఈ సంగీత కార్యక్రమం ఉందన్నారు. భారతీయ సంప్రదాయ సంగీతం నిర్మలమైనది, అద్భుతమైనదని అభివర్ణించారు. ఇటువంటి సంగీతాన్ని శ్రోతలకు వినిపించడానికి ఈకార్వో, డీసీఏ చేస్తున్న ప్రయత్నాన్ని డీఆర్ఎం అభినందించారు. ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం మొదటిదని, దీని ద్వారా రైల్వే ఉద్యోగులు, సంగీత ప్రేమికులు చాలా ప్రోత్సాహం పొందారని తెలిపారు. వాల్తేర్ డివిజన్ కల్చరల్ అసోసియేషన్‌కు చెందిన గాయకులు జి.వి.సురేష్, కె.వి.సురేష్, రణధీర్‌కుమార్, ఎస్.ఎ.రాజు, ఎం.భారతి, వాయిద్యకారులు యు.శ్రీనివాస్ తదితరులు హిందుస్థానీ, కర్ణాటక, భజన్లను ఆలపించారు. తమ ప్రదర్శనతో శ్రోతలు, సంగీత ప్రేమికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు పాల్గొన్నారు.

చిక్కితే తుక్కే..

- పోలీస్ స్టేషన్లలో మూలుగుతున్న వాహనాలు
- ఎండకు, వానకు పాడవుతున్న వైనం
- ఆరిలోవ పోలీసు స్టేషన్‌లో పేరుకుపోతున్న వాహనాలు

పోలీసుల చేతికి పొరపాటునో... గ్రహపాటునో వాహనం చిక్కితే వాటిపై ఆశలు వదులుకోవాల్సిందే. ప్రమాదవశాత్తు కావచ్చు.. నిబంధనలు పాటించలేదని కావచ్చు.. లేదా దొంగలించింది కావచ్చు... కారణం ఏదైనా వాహనాలు స్టేషన్ ప్రాంగణానికి వెళితే ఇక అంతేమరి.. ఎండకు ఎండి వానకు తడిచి తుక్కు పట్టాల్సిందే. ఈ పరిస్థితి జిల్లా అంతటా ఉంది.

– ఆరిలోవ



ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో వాహనాలు గుట్టలుగా పేరుకుపోయాయి. వివిధ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు రోజురోజుకూ పేరుకుపోతున్నాయి. చాలా వాహనాలు తుప్పపట్టాయి. స్థలం చాలకపోవడంతో పోలీసులు ఎక్కడపడితే అక్కడ వాటిని నిలిపేస్తున్నారు. ఏళ్ల తరబడి స్టేషన్ సమీపంలో ఉండిపోవడంతో ఇరుపక్కలా పాడుబడిన వాహనాల పార్కులా మారిపోయింది. ఈ స్టేషన్ చిన్నది. ఓ గదిని మూడు భాగాలుగా చేసి సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు సుమారు 40 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ పోలీసు స్టేషన్ నిత్యం రద్దీగా ఉంటుంది. ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలు గుట్టలుగా పేరుకుపోయాయి. పోలీసు స్టేషన్ సమీపంలో ఎక్కడబడితే అక్కడే వాహనాలు ఉంచడంతో ఆ దారిలో ఉన్న సచివాలయాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.



స్టేషన్‌లో ఉన్న వాహనాలు

సచివాలయాలకు దారిలేదు..

ఈ స్టేషన్ పక్కనే ఉన్న ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన కార్యాలయం ఉంది, 12వ వార్డుకు చెందిన 1, 2, 21 నంబరు గల మూడు సచివాలయాలు ఈ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్నాయి. ఆయా సచివాలయాలకు పోలీస్ స్టేషన్ పక్కనుంచి వెళ్లాల్సి ఉంది. ఆ స్థలమంతా వాహనాలు నిలిపి ఉండటంతో పాటు సచివాలయాలు ముందు కూడా కార్లు, ఆటోలు నిలిపేశారు. సచివాలయం సిబ్బంది సైతం వారి ద్విచక్ర వాహనాలు నిలపడానికి వీలుపడటంలేదు. దీంతో ఈ కార్యాలయాలకు తనిఖీ కోసం వెళ్లిన అధికారులు వాహనాలు కూడా స్టేషన్ ముందు ప్రధాన రహదారిపైనే నిలుపుతున్నారు. సుమారు ఆరేడేళ్లుగా నుంచి ఇక్కడ నిలిపిన కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు తుప్పుపట్టిపోయాయి. సుమారు 130 వాహనాలు నిలిపేశారు. వాటిలో 9 కార్లు, ఏడు ఆటోలు, 2 మినీ వ్యాన్లు, మిగిలినవి ద్విచక్రవాహనాలు ఉన్నాయి.

పరిధి విశాలం..

ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి విశాలమైంది. అటు రుషికొండ నుంచి ఎండాడ, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం, విశాలాక్షినగర్, ఇటు హనుమంతవాక నుంచి డెయిరీఫారం, ఆరిలోవ పెదగదిలి, చినగదిలి, పైనాపిల్‌కాలనీ, ధారపాలెం వరకు పరిధి ఉండటంతో ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలకు గురైన వాహనాలు సంఖ్య ఇక్కడ పెరిగిపోతోంది. దీంతో ఇవి గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుట్టలుగా పేరుకుపోతున్న వాహనాలను వేరే చోటకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసులేం చేయాలి..

నిబంధనల ప్రకారం ఒక వాహనం ప్రమాదవశాత్తు గాని, స్వాధీనం చేసుకున్నది గాని, దొంగిలించింది గాని పోలీసులకు చిక్కితే స్టేషన్‌కు తరలించాలి. సీజ్ చేసి రెవెన్యూ కార్యాలయాలకు సమాచారమివ్వాలి. బహిరంగ ప్రకటన ద్వారా ఆరు నెలల అనంతరం వేలం వేయాలి. ఇలా ఎక్కడా జరగడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇదిలా ఉంటే ప్రమాదం జరిగిన వాహనాన్ని తిరిగి వాడేందుకు కూడా చాలా మంది యజమానులు ఇష్టపడ్డంలేదు. ఫలితంగా స్టేషన్లలో వాహనాలు పేరుకుపోతున్నాయి.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం



జోడుగుళ్లపాలెంలో శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో శ్మశానం, రజకుల దోబీఖానా నిర్మాణాల కోసం ఆదివారం కార్పొరేటర్ స్వాతితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.55 లక్షలతో శ్మశానవాటిక చుట్టూ రక్షణ గోడ, బర్నింగ్ ప్లాట్ ఫారం నిర్మాణంతో పాటు దీనికి సమీపంలో మరో రూ.20 లక్షలతో రజకుల కోసం దోబీఖానా నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు ఆమె సూచించారు. అన్ని వార్డుల్లోనూ మౌలిక వసతులు కల్పించడంలో జగనన్న ప్రభుత్వం ముందుంటుందన్నారు. విశాఖలో రాజధాని ఏర్పాటు చేస్తే ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విమ్స్‌లో పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు



ఔట్ పోస్టు సేవలను గురించి విమ్స్ సిబ్బందికి వివరిస్తున్న ఏసీపీ మూర్తి

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(విమ్స్)లో పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేశారు. ఇందు కోసం ఇక్కడ క్యాజువాలిటీ విభాగంలో ప్రత్యేకంగా ఓ గదిని కేటాయించారు. దీనిని ఆదివారం ద్వారకా ఏసీపీ మూర్తి ప్రారంభించారు. విమ్స్ వైద్యులు, సిబ్బందికి అవుట్ పోస్టులో ఏరకమైన సేవలు అందుబాటులో ఉంటాయో వివరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ విమ్స్‌లో ఔట్ పోస్టు ఏర్పాటు చేయడం వల్ల రోగుల బంధువులు సులువుగా సమాచారం తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. క్యాజువాలిటీలో అత్యవసర సమయంలో సత్వరం వైద్యం అందడానికి, ప్రమాద కేసులు నమోదు చేయడానికి వీలు పడుతుందని చెప్పారు. రోగులకు రక్షణ చర్యలతో పాటు వైద్య సేవల్లోను అవుట్‌పోస్టు ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టుకార్డు ఉద్యమం



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ ఉత్తరాలు రాస్తున్న స్థానికులు

ఆరిలోవ: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలంటూ ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టింది. ఇందులో భాగంగా ఆదివారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉత్తరాలు రాసే కార్యక్రమం నిర్వహించింది. ముందుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను స్థానికులకు వివరించారు. అనంతరం సుమారు 60 మంది 'స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపండి'అంటూ ప్రధానమంత్రి మోదీకి ఉత్తరాలు రాశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ ప్రియాంక మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం భూములు ఇచ్చిన సుమారు 8 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వకుండానే పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. రాజ్యాంగంలో ప్రజలకు కల్పించిన హక్కులను కేంద్ర ప్రభు త్వం కాలరాస్తోందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం పలు కమిటీలు చేపడుతున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యమంలో తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పాల్గొనాలని ఆమె కోరారు. పోస్టుకార్డు ఉద్యమాన్ని నిరంతరం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు జగన్, నుశ్చల్, నాగరాజు, హర్ష పాల్గొన్నారు.

ఉద్యమిస్తున్నారన్న ఉక్రోషంతోనే ఉత్పత్తి నిలిపివేత

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమిస్తుందన్న ఉక్రోషంతోనే స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తిని నిలిపివేశారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 822వ రోజు ఆదివారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రైవేటీకరణలో భాగంగా ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం కూడా కేంద్రానికి సహకరిస్తూ ఒక్కొక్క అడుగు ముందుకు వేయాలని ప్రయత్నిస్తున్నారని, వీరి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

వసతిగృహంలో ఘనంగా మాతృ దినోత్సవం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థినుల హాస్టల్ సముదాయంలో ఆదివారం మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెక్టార్ ఆచార్య కె.సమత ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ డాక్టర్ రాజమాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న రెక్టార్ ఆచార్య కె.సమత

బాలిక వైద్యానికి సహకరించండి

సీతమ్మధార: జీబీ సిండ్రోమ్‌తో కొన్నేళ్లుగా మంచానికే పరిమితమైన ద్వారకానగర్‌కు చెందిన చిన్నారి కావ్య చికిత్సకు రాష్ట్ర ప్రభుత్వం, దాతలు చేయూతనిచ్చి సహకరించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కోరారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం విశాఖ నగర కమిటీ ప్రతినిధులు సమకూర్చిన రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం బాలిక ఇంటికి వెళ్లి తండ్రి హరికుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ రూ. 50 లక్షలు అప్పు చేసి వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయించిన ఈమె తండ్రి రైల్వే ఉద్యోగానికి సైతం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారని గుర్తుచేశారు. తండ్రి పెన్షన్‌తోనే అరకొర వైద్యం అందిస్తు ఇక తాము ఆర్థికంగా తట్టుకోలేమని, వైద్యం నిలిపివేస్తామని కన్నీటి పర్యంతంతో వాపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, దాతలు చేయూతనిచ్చి బాలిక వైద్యానికయ్యే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టి తీసుకెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టా ఫౌండేషన్ పట్టా రమేష్, ఫోరం డాక్టర్ శకుంతల, కె.ఎల్లయ్య, డాక్టర్ ఆదిమూర్తి, హరిష్ పాల్గొన్నారు.



బాలిక కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తున్న సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

తగరపువలస: స్థానిక జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరంలోని కంచరపాలేనికి చెందిన తణుకుల వెంకటలక్ష్మి గాయపడింది. అనకాపల్లి జిల్లా వి.మాడుగులకు చెందిన టాటా ఏస్ వాహనం శ్రీకాకుళం జిల్లా అరసవిల్లి వెళ్తూ రోడ్డు దాటుతున్న వెంకటలక్ష్మిని ఢీకొంది. సంగివలస వద్ద పెళ్లి కోసమని వచ్చిన ఆమె సాయిరాం పార్లర్ వద్ద రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదానికి గురైంది. భీమిలి ట్రాఫిక్ పోలీసులు చికిత్స కోసం ఆమెను ఆస్పత్రికి తరలించారు.

'ఎవరికి కేటాయించిన షాపుల్లో వారే ఉండాలి'



ఎంవీపీ రైతుబజార్‌లో డ్వాక్రా గ్రూప్ మహిళతో మాట్లాడుతున్న ఏడీ యాసిన్

ఆరిలోవ: ఎంవీపీ కాలనీ రైతుబజార్‌ను ఆదివారం మార్కెటింగ్ శాఖ ఏడీ షేక్ యాసిన్ సందర్శించా రు. ఇక్కడ నిర్వహిస్తున్న షాపులు, ఆవరణాన్ని పరిశీలించారు. రైతులు, డ్వాక్రా గ్రూపు మహిళలకు కేటాయించిన షాపుల్లోనే ఉన్నారా, లేదా అనే దానిపై ఆరా తీశారు. నేరుగా షాపుల వద్దకు వెళ్లి వారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన షాపుల్లో వారే కూరగాయలు, పండ్లు, కిరాణా తదితర వాటిని విక్రయించాలన్నారు. బినామీలు ఉండకూడదని, ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుబజార్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతుబజార్ ఈవో ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

వర్సిటీని సందర్శించిన పూర్వ విద్యార్థులు



పూర్వ విద్యార్థులను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని విశిష్ట స్థానాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సందర్శించారు. సివిల్ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థి ఏసీసీవోఎం సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.వి.రామలింగరాజు, ఒరాకిల్ కార్పొరేషన్ వైస్ ప్రెసిడెంట్ జి.నరసింహారావు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూ సాధిస్తున్న ప్రగతిని వీసీ వారికి వివరించారు. స్టార్టప్ ఇంక్యుబేషన్ కేంద్రాలను నెలకొల్పడం, చైర్ ప్రొఫెసర్ల ఏర్పాటు, క్రీడా మైదానాల అభివృద్ధి, తదితర అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. డాక్టర్ రామలింగరాజు ఏయూలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో చైర్ ప్రొఫెసర్ ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. అదే విధంగా ఎంటెక్(జియోటెక్నికల్ ఇంజినీరింగ్)లో బంగారు పతకాన్ని ఏర్పాటు చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారిని వర్సిటీ తరపున వీసీ సత్కరించారు. అనంతరం వారు ఏయూ స్టార్టప్ సెంటర్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య సి.ఎన్.వి.సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృక్షశాస్త్రంలో మాలతికి డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థిని సత్తి ఎస్.ఎల్.ఎస్.కె.మాలతికి డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు పి.కె.రత్నకుమార్, డాక్టర్ జి.ఎం.నరసింహారావు సంయుక్త పర్యవేక్షణలో తూర్పు కనుమల్లో వృక్షాలపై జరిపిన పరిశోధనకు ఆమెకు వర్సిటీ డాక్టరేట్ అందించింది. పుణ్యగిరి, అనంతగిరి, గాలికొండ ప్రాంతాలలో ఉన్న వివిధ స్టెరిడోఫైట్‌ల పంపిణీ, ఔషధ గుణాలను తన పరిశోధనలో భాగంగా అధ్యయనం చేశారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను మాలతి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య సి.ఎన్.వి.సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి



దీన్‌దయాల్‌పురంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి



పాత డెయిరీ ఫారం వద్ద ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: హనుమజ్జయంతి వేడుకలు తూర్పు నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా జరిగాయి. జీవీఎంసీ 9వ వార్డులో విశాలాక్షినగర్, సంజీవినగర్, హనుమంతవాక, 10వ వార్డు డెయిరీ ఫారం కూడలి, 11వ వార్డు బాలాజీనగర్, 12వ వార్డు చినగదిలి, నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయ ఆవరణం, 13వ వార్డు దీన్‌దయాల్‌పురంలో ఉన్న ఆంజనేయ స్వామి, తదితర ఆలయాల్లో హనుమజ్జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. డెయిరీ ఫారం వద్ద ఆలయ నిర్వాహకులు భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు.

మేయర్ ప్రత్యేక పూజలు

మేయర్ గొలగాని హరివెంకటకుమారి 10వ వార్డులో డెయిరీ ఫారం వద్ద ఆంజనేయస్వామి ఆలయం, 13వ వార్డు దీన్‌దయాల్‌పురంలో ఆంజనేయ స్వామి ఆలయాలను సందర్శించారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, కెల్ల సత్యనారాయణ, తదితరులు కూడా ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్-6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. మహన్యాసపూర్వక పంచామృతాభిషేకం, సింధూరార్చన, నాగవల్లీ దళార్చన పూజలు వైభవంగా జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎంవీపీ కాలనీ సెక్టార్-6లో ప్రత్యేక అలంకరణలో హనుమాన్

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెంలో హనుమాన్ ఆలయం వద్ద భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏపీ స్టేట్ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ హాజరై భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు పీతల అప్పారావు, రాజారావు, దువ్వి రాజశేఖర్, పీతల ప్రవీణ్ క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.



22వ వార్డులో అన్నసంతర్పణ చేస్తున్న పీతల గోవింద్

పబ్లిక్ డిమాండ్

వీధి లైటు వెలగక అంధకారం

మద్దిలపాలెం : ఎంవీపీ కాలనీ సెక్టార్ -5లో వీధి లైట్ వెలగకపోడంతో రాత్రి వేళ అంధకారం నెలకొంది. విద్యుత్ స్తంభం డీఏఫ్/51/50/ఏకు ఉన్న లైటు కొద్ది రోజులుగా వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ బయటకు రావడానికి భయమేస్తోంది. రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే వీధి లైట్ వేయాలి.

– ఎస్.సత్తిబాబు, ఎంవీపీ కాలనీ సెక్టార్-5



ఎంవీపీ సెక్టార్ 5 లో వెలగని వీధి లైటు